ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## చతుర్ధాధ్యాయము

### పరాంబికా పరంధామము – దేవి గాధాశ్రవణ ఫలము :-

అపూర్వములైన పావన విషయములను విన్న మణిగుప్తాదులు ఆనంద కందళిత హృదయారవిందులై సాలంకాయన మునితో "ఓ గురూత్తమా! ఆదిశక్తి యొక్క మహత్వమును గూర్చి ఎంతవిన్నను తనివిదీరకున్నది. సృష్టిస్థితిలయములకు మూలకారణమును అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకియునైన ఆ దేవదేవి యొక్క ఆవాస వైభవమును, ఆ జగన్మాత ఘనతను వాత్సల్యముతో మాకు తెలియజేయుడు" అని ప్రార్థించిరి. అపుడా సాలంకాయనుడు నాయకులారా! యిపుడు మీరడిగనట్లే పూర్వము శౌనకాదిమునులు సూతమౌనినడిగిరి. సూతుడు మునులకు దూర్వాస మహర్షికృతమైన శ్రీ చక్రనగర వర్ణమందుగల దేవ్యావాస వైభవమును గూర్చియు, వ్యాసప్రోక్తమైన మార్కండేయ పురాణమందలి మహత్తరములైన దేవీగాధలను గూర్చియు తెలియజేసెను. నేనావిషయములను మీకు సంక్షిప్తముగ వినిపించెదను. మీరు భక్తిశ్రద్ధలతో విని ధన్యజీవనులు కాగలరు. ఈ దేవీ మహత్తర గాథలు ప్రధానముగ దేవీశరన్నవరాత్ర్యుత్సవముల సమయములందు అష్టమి, నవమి, దశమి తిథులలో పఠించువారికి సర్వసౌభాగ్యములు కలుగును. తన దివ్యగాథా శ్రవణము వలన కలుగు ఫలితములను గూర్చి ఆ పరాశక్తియే స్వయముగ యిట్లు చెప్పెను.

"ఎవడు నన్ను నిశ్చల చిత్తముతో ఎల్లప్పుడు స్తుతించునో, వాని సమస్త బాధలను నేను నిస్సంశయంముగ నశింపజేతును. అట్లే మధుకైటభ నాశనము, మహిషాసురమర్ధనము, శుంభనిశంభుల వధలను గూర్చిన కథలను మరియు నా మహత్త్వమును వినువారు, పఠించువారు, సమస్త దుఃఖముల నుండియు, పాపముల నుండి విముక్తులౌదురు. నా దివ్యగాధాశ్రవణ పఠనాదులు అంటువ్యాధుల వల్లను మరియు మహామారివల్లను కలుగు అపాయములను దూరము చేయును. అపూర్వములైన గ్రహ నక్షత్రములు పుట్టుట - పిడుగులు పడుట, అద్భుతములైన చరాచరవస్తువులు కల్గుట అను దివ్య అంతరిక్షభౌమ ఉత్పాతములగు త్రివిధోత్పాతములను శమింపజేయగలవు. ప్రతి సంవత్సరము శరన్నవరాత్రులలో నా మహాత్త్యమును పఠించువారు వినువారు సమస్త విపత్తుల నుండియు విముక్తులై సమస్త సన్మంగళములను పొందగలరు."

అని చెప్పిన దేవీ భాషణమును వినిపించిన సూతుడు, అటుపై శౌనకాదులతో ఓ మునులారా! పరాశక్తి నిత్యయైనను లోకసంరక్షణార్థమై మాటిమాటికీ అవతరించుచుండును. ఆ దేవియే సృష్టిస్థితిలయకారిణి. బ్రహ్మాండపురాణములోను, మార్కండేయ పురాణములోను వర్ణింపబడిన అయ్యాదిశక్తి చరిత్ర స్కాంద పురాణములోని ఉత్తరఖండమందలి సనత్సుజాత సంహితయందు సవిస్తరముగ వర్ణింపబడినవి. ఏదేవి సర్వభూతములయందు చైతన్యస్వరూపయై, బుద్ధి స్వరూపయై, నిద్రాస్వరూపమై, శక్తి స్వరూపయై, క్షుదాస్వరూపయై, తృష్ణాస్వరూపయై, క్షాన్తిస్వరూపయై, శాన్తిస్వరూపయై, కాంతస్వరూపయై, తుష్టి, పుష్టి, భ్రాంతి, స్మృత్యాది సమస్త స్వరూపములతో, విరాజిల్లుచున్నదో మరియు ఏదేవి సర్వవ్యాపకురాలై జ్ఞానరూపిణియై జగత్పాలకురాలై యోగమాయ, ఆదికన్య, బ్రహ్మశక్తి, పరాత్పరి, సచ్చిదానంద రూపిణి యను

పలువిధనామములతో ప్రసిద్ధురాలై యున్నదో ఆదేవీ పరంధామము శ్రీచక్రనగరము. ఆదేవి యొక్క ఆవాస వైభవము వర్ణనాతీతము. ఆ పరంధామము అన్ని లోకములపైన సర్వలోకాధికమై యొప్పుట వలన సర్వలోకమని పిలువబడుచున్నది. అది బ్రహ్మలోకము కన్న మిన్నయైనది. కైలాసముకంటె శ్రేష్ఠమైనది. వైకుంఠము కంటె ఉత్తమమైనది. గోలోకము కంటె గొప్పదైనది. ఆ ఆదిశక్త్యావాసము ముజ్జగములకు గొడుగువంటిది. సంసార సంతాపమును నశింపజేయునది. బ్రహ్మాండములన్నింటికిని చల్లని నీడవంటిది. ఆ పరాశక్తి పరంధామము చుట్టును అమృత సముద్రము విరాజిల్లుచుండును. మహత్తమము, శ్రీచక్రనగరాఖ్యమునైన ఆ పరంధామము సర్వవిధలోహములతోడను రత్నములతోడను నిర్మించబడిన అనేక మహాప్రాకారములు కలిగి, అఖిల బ్రహ్మాండములలోని సర్వదేవతల సమష్ట్యాత్మక దేవీదేవతాగణములతో మరియు వారి పరివారములతో, సమస్త విధసంపదలతో, సర్వ విధముల ఆనంద సౌందర్యములతో సముజ్వలముగ ప్రకాశించుచుండును. ఆ మణిద్వీప మధ్యభాగము శ్రీ కరమైన చింతామణి గృహమున్నది. అది అనేక వేల మణిస్తంభములతో, మంటపములతో, దుర్నిరీక్ష్యములైన వెలుగులనీనుచు ప్రకాశించుచుండును. ఆదిశక్తి సంకల్పముతో ఆదియందే నిర్మించబడిన శ్రీ చక్రనగరమందలి చింతామణి గృహమున దశవిధ శక్తితత్వములు మెట్లుగ, బ్రహ్మవిష్ణురుద్రేశ్వరులు పాదములుగ, సదాశివుడు ఫలకముగగల చిదగ్ని గర్భిత సింహపీఠముపై ఆదిశక్తియైన భువనేశ్వరీదేవి కొలువుదీరియుండును. ఆ జగన్మాత రూపవైభవము వర్ణింపనలవికానిది. పాశాంకుశవరదాభయ ముద్రలు దాల్చిన చతుర్బాహువులతో అందాలకే అందాలరాశియై, కరుణామయియై, సర్వాలంకార భూషితమై, కోటానుకోట్ల సూర్యచంద్ర విద్యుత్కాంతులకు సమమైన స్వయం ప్రకాశము గలదై వెలుగొందును. సమస్త బ్రహ్మాండముల నుండి ముక్తులై వచ్చిన సర్వభక్తులచేతను, దేవదానవ మానవాది సమస్త

జాతుల జీవుల చేతను నిరంతరము సేవించబడుచుండును. అక్కడ సప్తకోటి మహామంత్రములు, దశ మహావిద్యలు రూపుదాల్చి ఆయమ్మనారాధించుచుండును. “ఓ మునివరులారా! సర్వలోకములందుత్తమోత్తమము, దివ్యాతిదివ్యము, పరంధామము మహత్తమమునైన శ్రీదేవి ఆవాసవైభవమును మరియు దేవీరూప వైభవమును, మీకత్యంత సంక్షిప్తాతిసంక్షిప్తముగ సారభూతముగ తెలియజేసితిని. నూతన గృహారంభ సమయములందును, వాస్తుయాగములందును, గృహప్రవేశ సమయములందును యీ విషయమును పఠించువారు, వినువారు సమస్త శుభములను బడయగలరు.

అని యిట్లు దేవ్యావాస వైభవమును గూర్చి తెలిపిన సాలంకాయన మహర్షి మణిగుప్తాదులతో “ఓ వైశ్యోత్తములారా! మరియొక ముఖ్య విషయము వినుడు, దుష్టశిక్షణము, శిష్టరక్షణము గావించు ఆదిపరాశక్తి యొక్క మహద్భుత గాథలు పూర్వము మేధసుడను మహామునిచే సురథుడను రాజునకు, సమాధియను వైశ్యోత్తమునకు జెప్పబడినవి. ఆ వైశ్యోవంశపాదోధిచంద్రుని కారణమున బహిర్గతములైన దేవీ మహత్వగాథలు వేదవ్యాసకృతమగు మార్కండేయ పురాణమున సవిస్తరముగ వర్ణింపబడి ప్రసిద్ధములై లోకవతారకములైనవి. ఆ సమాధివలన వైశ్య వంశమే పునీతమైనది సుమా.” అని పలికెను.

ఆ మాటలు వినిన మణిగుప్తాదులు “గురువరా! మా వంశము నందు ద్భవించిన పావనమూర్తియగు ఆ సమాధినాముని దివ్య చరితమును, ఆదిపరాశక్తిచే యొనరించబడిన దుష్ట శిక్షణల గాథలను దయతో మాకు వినిపింపుడు” అని వినయపూర్వకముగ ప్రార్థించిరి. అంత సాలంకాయనుడు వాత్సల్యపూర్ణ హృదయుడై యిట్లు చెప్పెను.

## సమాధినాముడగు వైశ్యోత్తముని వృత్తాంతము :-

పూర్వము చైత్ర వంశమునందు బుట్టిన సురధుడను రాజు సమస్త భూమండలమును పాలించుచుండెను. ఆ సురధ మహారాజునకు కోలావిధ్వంసులను ప్రసిద్ధిచెందిన రాజులు ప్రబల శత్రువులైరి. వారితో సురధునకు యుద్ధము సంభవించెను. ఆ కోలా విధ్వంసులచే అన్యాయ యుద్ధమున వోడింపబడిన సురధుడొక అశ్వము నధిరోహించి, యొక ఘోరారణ్యమున కేగెను. అతడా అడవిలో, పశుపక్ష్యాదులచే నిండినదియు, ముని శిష్యులచే ప్రకాశించునదియు, ప్రశాంతమైనదియునగు మేధసమున్యాశ్రమమును జూచెను. అటనా మేధసమునిచే సత్కరింపబడినవాడై కొంతకాలము ఆయాశ్రమములో నుండి పిమ్మట మమకారముచే ఆకర్షింపబడిన మనస్సుగలవాడై తాను పోగొట్టుకొనిన రాజ్య సంపదలను, ప్రజలను గూర్చి ఎల్లప్పుడు జింతించుచు ఆ మున్యాశ్రమమునందు ఇటనట దిరుగాడుచుండెను. ఒకనాడతడా యాశ్రమ ప్రాంతమున నొకవైశ్యుని గాంచి "ఆర్యా! తామెవ్వరు? ఇక్కడికి వచ్చుటకు కారణమేమిటి? ఎందువలన శోకగ్రస్తునివలె ఖిన్నులై కాన్పించుచున్నారు? అని ప్రశ్నించెను. స్నేహపూర్వకములైన యా వాక్యములను విన్న ఆ వైశ్యుడు వినయముతో "రాజా! నేను సంపన్న వంశమున జన్మించిన సమాధియను వైశ్యుడను. నేనొనరించు నిరంతర దానధర్మాదులు నచ్చని ధనలోలులైన పుత్ర మిత్రాదులచే వెడల గొట్టబడి, యీ యరణ్యమున కరుదెంచితిని. ఇక్కడ నుండుటచే నా పుత్రాదుల కుశలాకుశలములు నాకేమియు దెలియకున్నవి. నా మనసెల్లప్పుడును వారి యోగక్షేమములన గూర్చియే ఆలోచించుచున్నది. "ఓ రాజా! దుష్టస్వభావులగునా సుతాదుల యందీరీతినా చిత్తము ప్రేమపూరితమై యుండుట యనుచితమని దెలిసినను నాకెందులకిట్టి చింత కలుగుచున్నదో తెలియజాలకున్నాను." అని బదులు పలికెను.

అంతట ఆ సురథడును, సమాధియు మేధసమునికడకేగి తమ వృత్తాంతములను దెలిపి, ఆ మునిసత్తముని విద్యుక్తముగ సత్కరించి, “ఓ మునీశ్వరా! నేను రాజ్యమును కోల్పోయిన వాడనై యుండియు ఆ రాజ్యమునందే మమత్వము కలిగియున్నాను. ఇతడు పుత్రాదులచే వెడల గొట్టబడిన వాడయ్యు సదా వారియందే అనురక్తుడై యున్నాడు. ఇట్లీతడును, నేనును ఆయా విషయమునందలి దోషములు జూచుచునే వానియందు మమత్వ బుద్ధి కలిగి, మిక్కిలి దుఃఖితులమై యున్నాము. ఓ మహానుభావా! వివేక వంతులమైనను మాకీమూఢత్వమేల కల్గినది? జ్ఞానవంతులకు గూడ నిట్టి మోహము గలుగుట యెట్లు సంభవించుచున్నదో? ఇట్లగుటకు గల కారణమేమిటో దయతో తెలియజేయుడు” అని ప్రార్థించిరి.

అంత మేధసుడు “నాయనలారా! ఇంద్రియ గోచరమగు విషయజ్ఞానము సమస్త ప్రాణులకునుగలదు. మోహపూరితమగు ఆ జ్ఞానము మానవులకును యితర పశుపక్ష్యాదులకును సమానము. సృష్టిస్థితిలయకారిణియగు ఆ మహామాయా ప్రభావముచే నెల్లప్పుడు యీ సృష్టియంతయును బలాత్కరముగ మోహింప జేయబడుచున్నది. భగవతియగు నాదేవి జ్ఞానులకు సైతము బలవంతముగ నాకర్షించి మమతయనెడి సుడిగుండమున బడద్రోయుచున్నది. మాయ, యోగనిద్ర, యోగమాయా కన్యకఅనబడునా పరాశక్తి నిర్గుణమైన బ్రహ్మరూపము గలదియును, గుణాత్మమైన ప్రకృతి రూపము గలదియునై యున్నది. ఆమె చేతనే యీ చరాచర జగత్తంతయును సృజించబడుచున్నది. ప్రసన్నురాలును, వరదాయినియునగు ఆ దేవియే మానవులకు ముక్తిదాయిని యగుచున్నది అని తెలిపెను. అంతట యాసురథసమాధులు “ఓ మహామునీ! తమరు మహామాయ యనియు, యోగమాయాకన్యయనియు తెల్పుచున్న ఆ దేవి ఎవరు? ఆమె మహిమను గూర్చి సవిస్తరముగ మాకు దెల్పుడు” అని ప్రార్థించిరి.


అపుడా మేధసుడు వారితో ఓ మానవోత్తములారా! పూర్వము మార్కండేయ మహర్షికి బ్రహ్మనుడివిన తీరున దేవీ మహాత్మ్యమును నేడు మీకు జెప్పుచున్నాను. సావధానచిత్తులై వినుడు. కల్పాంతమున జగత్తంతయు ఏకమై ప్రళయజలరాశి రూపముననుండగా భగవానుడు శ్రీ మహావిష్ణువు శేషతల్పశాయియై యోగనిద్రలో వుండెను. విష్ణుదేవుని చెవియందలి మలినము నుండి మధుకైటభులను యిర్వరు రాక్షసులుదయించి బ్రహ్మను జంపుటకు యత్నించిరి. విష్ణునాభికమలమున గూర్చుండియున్న ప్రజాపతియగు బ్రహ్మ మహోగ్రులగు రక్కసుల నిరువురను మరియు నిద్రించుచున్న మహావిష్ణువు ను జూచి ఆ విష్ణువును మేల్కొల్పుటకై ఆయన నేత్రములందు వశించి యున్నదియు విశ్వేశ్వరియు, సృష్టి స్థితిలయములకు మూలమ్మైనదియు, విష్ణువును వశమొనర్చుకొని యున్నదియునగు నా యోగనిద్రాదేవిని యేకాగ్రచిత్తులై యిట్లు స్తుతించెను.

"ఓ దేవీ నీవు స్వాహామంత్రమవు. నీవు స్వధామంత్రమవు. స్వరములకు మూర్తివి. వషట్కారమవు నీవే. సుధవు నీవు నాశనరహితవు. శాశ్వతవు. నీవే త్రిమాత్రాత్మకమైన ఓంకారమవు. పూర్ణముగ నుచ్చరించుటకే శక్యముగాని నిత్యస్వరూపిణివగు అర్ధమాత్రవు నీవు. దేవతల జననియు, పరదేవతయునగు సావిత్రివి నీవే. నీవే సర్వమునకు మూలకారణమగు ప్రకృతివి. త్రిగుణములను ప్రవర్తిల్ల జేయుదానవు. కల్పాన్త ప్రళయకాలపు కాళరాత్రివి. అంతిమ ప్రళయకాలపు మహారాత్రివి. మహాభయంకరమగు మోహరాత్రివి. నీవు లక్ష్మివి. ఈశ్వరివి. ప్రబోధమును గల్గించు జ్ఞానవిజ్ఞామగు బుద్ధివినీవు. లజ్జ, పుష్టి, తుష్టి, శాంతి, ఓరిమి స్వరూపిణివి. విష్ణువును, నన్ను ఈశ్వరుని శరీరధారులను గావించిన నిన్ను స్తుతించుశక్తి ఎవరికి గలదు? ఓ దేవీ! యిట్టి యుదార ప్రభావశక్తి సంపన్నురాలవగు నీవు అప్రతిహితులగు ఈ మధుకైటభాసురలను, నీ మహిమచే సమ్మోహితులను జేయుము. జగత్స్వామియగు ఈ యచ్యుతుడు త్వరితముగ మేల్కొని

యీ మహాసురలను వధించునట్లు చేయుము.” అని బ్రహ్మచే నిట్లుస్తుతింపబడిన యోగనిద్రాదేవి విష్ణుదేవుని సర్వాంగముల నుండి నిర్గమించెను. విష్ణువు నిద్రనుండి మేల్కొనెను. పిమ్మట ఆ జగన్నాథుడు, దురాత్ములును అతిపరాక్రమ వంతులును, క్రోధారుణనేత్రులును, బ్రహ్మను భ్రింగివేయు నుద్యమించుచున్న వారునునగు మధుకైటభులను జూచెను. అంతనా విష్ణువు తన చేతులనే ఆయుధ ములగనుపయోగించి 5వేల సంవత్సరములు వారితో యుద్ధ మొనర్చెను. అపుడు బలగర్వితులును మహామాయా సమ్మోహితులు నైన ఆ మధుకైటభులు జనార్ధనునితో “ఓయీ! నీవు మా నుండి వరమును గోరుకొమ్ము” అని పలికిరి. అంత నా భగవానుడు వారితో ఓ యసురులారా! నా యెడల మీరు సంతుష్టులగుదురేని నేడు నాచే వధింపబడుడు. నాకిపుడన్య వరముతో ప్రయోజనమేమి? కావున నిదియే నేను గోరుకొను వరము అని వరమును గోరెను.

ఇట్లు వంచితులైన ఆ యిరువురు రక్కసులును జలమయమైన సర్వజగత్తును గాంచి కమలాక్షునితో “భూమి యెచ్చట మునిగియుండదో ఆ స్థలమున మమ్ముజంపు” మని పలికిరి. అంత భగవానుడట్లేయని పలికి శంఖ చక్ర గదాధారియై వారిని తనతోడలపై (ఊరువులపై) నిడుకొని చక్రాయుధముచే వారి శిరస్సులను ఛేదించెను.

అని చెప్పి మేధసఋుషి సమాధిసురధులతో నాయనలారా! దేవి యొక్క ఈ శ్రేష్ఠమగు మహాత్మ్యమును నేను మీకిప్పుడు తెలిపితిని. దేవి అట్టి ప్రభావ సంపన్నురాలు. ఓ ధీరవరులారా! ఆ పరమేశ్వరి యొద్ద శరణము నొందుడు. తనను పూజించువారికి ఆ దేవియే భోగమును, స్వర్గమును, మోక్షమును ప్రసాదించును. మమకారమువలనను, రాజ్యభ్రంశము వలనను ఖిన్నులైన ఆ సురధనరపాలుడును. సమాధివైశ్యుడును ఆ పలుకులు విని మేధసునకు ప్రణమిల్లి తపమొనర్చుటకై వెంటనేవెళ్లిరి.



వైశ్యముని సమాధితన 102 గోత్రములవారికి ముక్తిని ప్రసాదించమని ప్రార్థించగా ఆదిపరాశక్తి రాబోవు జన్మయందు నీ పుత్రికగా అవతరించి మోక్షము నొసంగుదునని వరమిచ్చుట

అంబాసందర్శనార్థులై ఆ వైశ్యుడును, రాజును ఒక నదీతీరమున ఇసుక దిబ్బపై కూర్చుండి శ్రేష్ఠమగు దేవీ సూక్తమును జపించుచు తీవ్రమైన తపమాచరించిరి. ఆహారము తీసుకొనక మనస్సులు దేవీయందే నిలిపి ఏకాగ్ర బుద్ధితో వారిరువురును తమ శరీర రక్తబిందువులతో తడిసిన బలులను సమర్పించిరి. లోకరక్షకురాలగు చండిక వారి ఘోర తపస్సునకు సంతుష్టినొంది ప్రత్యక్షమై, వలసిన వరములను కోరుకొనుడని పలికెను. అంత సురథరాజు తాను కోల్పోయిన రాజ్యమును తిరిగి పొందునట్లు అనుగ్రహింపుమని వరముకోరెను. కాని మేధస ఋషిబోధలచే జ్ఞానము నొందినవాడును, విరక్తచిత్తుడును, ప్రాజ్ఞుడును అగు సమాధివైశ్యుడు తనకును, తన బంధువర్గమగు నూట రెండుగోత్రముల వారికిని గూడా మోక్షమును ప్రసాదింపుమని ఆ జగన్మాతను వరము కోరెను. అపుడా దేవి సమాధిని జూచి "నాయనా! నేను నీ తపస్సుచే మిక్కిలి

సంప్రీతురాలనైతిని కానీ నీ బంధువర్గము వారందరును మోక్షము పొందవలెనన్నచో వారెల్లరకును కర్మఫల నిశ్శేషము గావలెను. నీవును యిపుడు కోర్కెలచే బంధితుడవైనావు గనుక నీవు మరికొన్ని జన్మల నందిన తదుపరియే పూర్ణముక్తిని పొందగలవు. అందుచే నీవు భవిష్యత్ కలియుగమున కుసుమ శ్రేష్ఠి అను వైశ్య ప్రభుడవై జన్మించెదవు. అపుడు నేను వాసవీకన్యకా నామమున నీకు కుమార్తెనై ప్రభవించి అధర్మమును అణచుటకై ఆత్మార్పణము గావించు నెపమున ఒక అపూర్వ మహోద్యమమును నిర్వహించి మీకును మీ బంధువర్గమంతటికిని మోక్షమును ప్రసాదించెదను. అంతవరకు నీవును నీ బంధువులును మహోన్నత పుణ్యపదము నందినవారై సమస్త సౌఖ్యములతో కాలము గడుపగలిగెదరు." అని వరమిచ్చెను. ఇట్లు దేవి వారు కోరిన వరములనొసగి అంతర్ధానురాలయ్యెను. సురధరాజు దేవీవర ప్రసాదముతో రాజ్యమును పొంది మరుజన్మమున సావర్ణియను పేరుగల మనువయ్యెను. సమాధివైశ్యుడు ఆత్మజ్ఞాన సంపదను పలువురకు పంచి స్వీయ వంశమునకు, సమాజమునకు మోక్షమార్గము చూపుచు కాలము బుచ్చి, అనంతర జన్మమున కైలాసవాసులగు సిద్ధవైశ్యుల నాయకుడై జన్మించెను. అని ఇట్లు సూతుడు శౌనకాది మహర్షులకు సమాధి సురధుల వృత్తాంతమును మరియు శ్రీదేవీమహత్వమును గూర్చి తెలియజేసెను.